
సాక్షి
శ్రీకాకుళం

శుక్రవారం । 7 । జూలై । 2023



ఎముకల శస్త్ర చికిత్సకు..

రిమ్స్‌లో 'సీ–ఆర్మ్స్' యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఎముకల ఆపరేషన్లు ఈజీ కానున్నాయి.

- 8లో



పిడుగుపాటు..

పిడుగుపాటుకు ఇద్దరు మృతి చెందారు. వేల్పురాయి,మదనాపురాల్లో ఘటనలు జరిగాయి.

- 8లో

పీహెచ్‌సీ పరిశీలన

జలుమూరు: సైరిగాం పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం జిల్లా నోడల్ అధికారి లక్ష్మీ తులసీ గురువారం పరిశీలించారు. లెప్రసీ సర్వే సక్రమంగా నిర్వహించాలన్నారు. సుబ్రహ్మణ్యపురంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం పర్యవేక్షించారు. ఆశ కార్యకర్తలు లెప్రసీ అనుమానిత కేసులు నమోదు చేయాలన్నారు.

న్యూస్‌రీల్

12న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరామన్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన జారీ చేశారు. జూలై 12న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు స్థాయి సంఘాల స మావేశం ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం 5 గంటల వరకు సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు.

హౌసింగ్ డీఈకి ప్రశంసా పత్రం



చీఫ్ ఇంజినీర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న డీఈ రామ్మూర్తి

నరసన్నపేట: గృహ నిర్మాణ శాఖ డీఈ రామ్మూర్తికి జిల్లాలో ఉత్తమ డీఈగా అభినందిస్తూ ప్రశంసా పత్రాన్ని గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజినీర్ అందించారు. గృహ నిర్మాణ శాఖ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విజయవాడలో గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రశంసా పత్రాన్ని ఇచ్చారు. జిల్లాలో నరసన్నపేట డివిజన్ గృహ నిర్మాణంలో గడిచిన ఏడాదిలో మంచి ప్రగతి కనబరిచినందుకు చీఫ్ ఇంజినీర్ అభినందించారు. ఈ సందర్భంగా డీఈ రామ్మూర్తి మాట్లాడుతూ ఈ స్ఫూర్తితో మరింత బాధ్యతగా పనిచేస్తామని అన్నారు.

గలగలా వంశధార



గొట్టా బ్యారేజీలో ఉన్న నీటి నిల్వ

- వంశధార నీరు విడుదల రేపు
- ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు

హిరమండలం: జిల్లాలో ఖరీఫ్ పనులు ప్రారంభమయ్యాయి. రైతులు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా గొట్టా బ్యారేజీ నుంచి కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా నీటి విడుదలకు నిర్ణయించారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేశారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు చేతులమీదుగా శనివారం నీరు విడుదల చేయనున్నారు. ఈ ఏడాది ఇంకా వానలు మొదలవ్వకున్నా.. గొట్టా బ్యారేజీలో కొంత నీటిని నిల్వ ఉంచారు. ఖరీఫ్ అవసరాలకు తగిన విధంగా అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. అయితే గత నాలుగైదు రోజులుగా ఒడిశా కేచ్‌మెంట్ ఏరియాలో పడిన వర్షాలకు బ్యారేజీలోకి వరద నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం బ్యారేజీలో 37.8 మీటర్ల నీటిమట్టం ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌కు తగ్గ నీరు బ్యారేజీలోకి చేరింది. దీంతో శివారుకు సైతం నీరు అందుతుందని అధికారులంటున్నారు.



ఎడమ ప్రధాన కాలువ ద్వారా..

గొట్టా బ్యారేజీ ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1,42,000 ఎకరాలకు సాగునీరు అందుతోంది. హిరమండలం, జలుమూరు, నరసన్నపేట, పోలాకి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, టెక్కలి, నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు ఈ కాలువ ద్వారా సాగునీరు అందిస్తున్నారు. 107 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కాలువకు అనుసంధానంగా పిల్లకాలువలు ఉన్నాయి. ఈ ఏడాది ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించింది. వేసవిలోనే పనులు చేపట్టింది. చాలాచోట్ల కాలువల్లో భారీగా గుర్రపు డెక్క పేరుకుపోయింది. దీన్ని కొంత మేర తొలగించారు.

కుడి ప్రధాన కాలువ ద్వారా..

కుడి ప్రధాన కాలువ 8 మండలాలను సస్యశ్యామలం చేస్తోంది. హిరమండలం, ఎల్ఎన్ పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, శ్రీకాకుళం రూరల్, గార తదితర మండలాల్లో 82 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కాలువను నిర్లక్ష్యం చేశారు. కిలోమీటర్ల మేర గుర్రపుడెక్క, మట్టి పేరుకుపోయింది. దీంతో శివారు ఆయకట్టుకు నీరందని పరిస్థితి. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఎక్కడెక్కడ ఇబ్బందిగా ఉందో అక్కడ ముందుగానే జంగిల్ క్లియరెన్స్ చేపట్టింది. దీంతో సాగునీటి ప్రవాహానికి అడ్డంకి తొలగింది.

ఏర్పాట్లు పూర్తి



గొట్టా బ్యారేజీ కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా శనివారం నీటిని విడుదల చేయనున్నాం. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. నది పరీవాహక ప్రాంతాలతో పాటు ఎగువన ఉన్న ఒడిశాలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. అయినా గత కొద్దిరోజులుగా నదిలోకి వస్తున్న నీటిని నిల్వ చేశాం. శనివారం రైతు దినోత్సవం సందర్భంగా నీరు విడుదల చేయడానికి నిర్ణయించారు. ఈ ఏడాది ఖరీఫ్‌నకు పూర్తిస్థాయిలో సాగునీరందిస్తాం.

– యలమంచిలి అనిల్‌కుమార్, ఇన్‌చార్జ్ డీఈ, గొట్టా బ్యారేజీ



శ్రీకాకుళంలో కుక్కలకు టీకాలు వేస్తున్న దృశ్యం

టీకా.. ఓ చైతన్య దీపిక

చికిత్స లేని వ్యాధులకు చైతన్యమే చక్కని పరిష్కారమని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ ఎం.కిశోర్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని శ్రీకాకుళం వెటర్నరీ పోలీ క్లినిక్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే అంటువ్యాధులపై అవగాహన పెంచుకుని, క్రమం తప్పకుండా వాటికి టీకాలు వేయించాలన్నారు. అనంతరం ర్యాబిస్ వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ప్రారంభించి అధిక సంఖ్యలో కుక్కలకు ఉచితంగా టీకాలు వేశారు. కార్యక్రమంలో వీపీసీ డాక్టర్ మనోజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు సూర్యం, డిప్యూటీ డైరెక్టర్ జగన్నాథం, పశువైద్యులు డాక్టర్ ఆశాలత పాల్గొన్నారు.

–శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)



పెంపుడు శునకంతో జంతు ప్రేమికురాలు

సాయం అందినా ప్రాణం దక్కలేదు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం చలమయ్యపేట కాలనీకి చెందిన జుత్తు సూర్యనారాయణ, అంజలి దంపతుల చిన్న కుమారుడు దేవాన్ష్ (19 నెలలు) గురువారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దేవాన్ష్ జీర్ణాశయ క్యాన్సర్ బారిన పడటంతో ఆర్థిక పరిస్థితి బాగా లేక వైద్యం చేయించలేని స్థితిలో తల్లిదండ్రులుండగా 'చిన్ని ప్రాణానికి ఆపద' శీర్షికతో జూన్ 30న సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దాతలు స్పందించి రూ.3.50 లక్షల వరకూ సాయం అందించారు. దీంతో చికిత్స చేయించేందుకు దేవాన్ష్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ గురువారం మరణించినట్లు చలమయ్యపేట మాజీ సర్పంచ్ అంగ గున్నయ్య తెలిపారు. శుక్రవారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చి దేవాన్ష్ అంత్యక్రియలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.



దేవాన్ష్ (ఫైల్)

యువకుడి వైద్యానికి ప్రభుత్వ సాయం

నరసన్నపేట: బీద కుటుంబానికి చెందిన కొండక శరణ్‌దీప్ వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందజేశారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు, యువనేత రామ్‌మనోహర్ నాయుడుల కృషితో సీఎం రిలీఫ్ ఫండ్ కొన్ని గంటల్లోనే మంజూరైందని యువకుడి తల్లిదండ్రులు కొండక ఆదినారాయణ, శారదలు తెలిపారు. ఇప్పటికే దాతల సహకారంతో రాయవెల్లూరు ఆస్పత్రిలో జరుగుతోందని చెప్పారు. శరణ్‌దీప్ పరిస్థితిపై గత నెల 21న సాక్షిలో 'దాతలే దిక్కు' అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో దాతలు స్పందించి పెద్ద ఎత్తున విరాళాలు అందజేశారు. ఇప్పుడు సీఎం రిలీఫ్ ఫండ్ కూడా మంజూరు కావడంతో తమ కుమారుడి వైద్యం సజావుగా జరుగుతుందని అమ్మానాన్నలు ఆనందం వ్యక్తం చేశారు.



చికిత్స పొందుతున్న శరణ్‌దీప్

భద్రంగా ఈవీఎం మిషన్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) గోడౌన్‌లో ఉన్న వీవీ ప్యాట్‌లను రాజకీయ పార్టీల సమక్షంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బి.లాఠకర్ గురువారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్, వీవీ ప్యాట్‌లను ప్రతి మూడు నెలలకోమారు పరిశీలించాలని, అందులో భాగంగా గురువారం పరిశీలించామని తెలిపారు. దీనివల్ల జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సి సెక్షన్ సూపరింటిండెంట్ ప్రకాష్, వైఎస్సార్ సీపీ ప్రతినిధి అందవరపు సూరిబాబు, టీడీపీ ప్రతినిధి పీఎంజే బాబు, సీపీఎం ప్రతినిధి గోవింద రావు, బీఎస్పీ ప్రతినిధి బొకర నారాయణరావు, సీపీఐ పార్టీ ప్రతినిధి చిక్కాల గోవింద రావు తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎం గోదాములను పరిశీలిస్తున్న దృశ్యం

145 మందికి నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ గురువారంతో పూర్తయ్యింది. పీజీటీలో బోటనీ, కెమిస్ట్రీ, ఒకేషనల్, జనరల్ సివిక్స్, కామర్స్, ఇంగ్లిష్, గణితం, ఒకేషనల్ ఎంపీ హెచ్‌డబ్ల్యూ, ఫిజిక్స్, జువాలజీ, ఒకేషనల్ జీఎస్‌సీ, ఎంఎల్‌టీలకు, సీఆర్టీలో బయో సైన్సు, ఇంగ్లీష్, హిందీ, గణితం, ఫిజికల్ సైన్సు, సోషల్ సైన్సు, పీఈటీ, తెలుగు, ప్రిన్సిపాల్ పోస్టులకు నియామకాలు చేపట్టారు. మొత్తం 145 మందికి నియామక పత్రాలు అందజేశారు. మెరిట్ రోస్టర్ ఆధారంగా నియామకాలు జరిగాయి. కార్యక్రమంలో ఏపీసీ ఆర్ జయప్రకాశ్, ఆర్‌వీఎం సిబ్బంది ఉన్నారు.

మీ కుటుంబాలు మాత్రమే పాలించాలా..?

- వెనుకబడిన కులాలు రాజకీయాల్లో ఉండకూడదా
- మంత్రి సీదిరిని విమర్శించే హక్కు శిరీష, రామ్మోహన్‌నాయుడుకు లేదు
- వైఎస్సార్‌సీపీతోనే మత్స్యకారుల అభ్యున్నతి
- ధ్వజమెత్తిన మత్స్యకార సంఘం ప్రతినిధులు



మాట్లాడుతున్న మత్స్యకార సంఘ నాయకులు

రణస్థలం: ఎంపీగా కింజరాపు రామ్మోహన్‌నాయుడు మత్స్యకారులకు చేసిందేమీ లేదని, ఏం అర్హత ఉందని టీడీపీ నాయకురాలు గౌతు శిరీష మంత్రి సీదిరి అప్పలరాజును విమర్శిస్తున్నారని మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు కోనాడ నర్సింగరావు ధ్వజమెత్తారు. మండలంలోని జీరుపాలెం గ్రామంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. గౌతు, కింజరాపు కుటుంబాలు మాత్రమే పాలించాలా.. వెనుకబడిన వర్గాల వారు రాజకీయాల్లో ఉండకూడదా అని సూటిగా ప్రశ్నించారు. గతంలో మా హక్కుల కోసం పోరాడితే 'తొక్క తీస్తాం.. తోలు తీస్తాం' అని టీడీపీ నాయకులు అన్న మాటలు అందరికీ గుర్తున్నాయని అన్నారు. మత్స్యకార వర్గానికి చెందిన సీదిరి అప్పలరాజుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంత్రి పదవి ఇవ్వడం వల్ల మత్స్యకారుల గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇది ఓర్వలేక ఎంపీ రామ్మోహన్‌నాయుడు, గౌతు శిరీష నిత్యం పలాసలో మంత్రిపై బురద జల్లుతున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్‌కు శంకుస్థాపన చేశారని, మూలపేటలో పోర్టు నిర్మాణం జరుగుతోందని, పలాసలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తున్నారని గుర్తు చేశారు. పాకిస్తాన్‌లో బందీలుగా ఉండిపోయిన మత్స్యకారులను సైతం ఇదే ప్రభుత్వం విడుదల చేయించిందని అన్నారు. మత్స్యకార భరోసా రూ. 4వేల నుంచి రూ. 10వేలకు పెరిగిందన్నారు. మంత్రిని విమర్శించే హక్కు శిరీష, రామ్మోహన్ నాయుడుకు లేదన్నారు. సమావేశంలో మత్స్యకార సంఘ నాయకులు మూగి శ్రీరాములు, మైలపల్లి కామరాజు, రాముడు, బడి రాంబాబు, మూగి గురుమూర్తి, వారధి లక్ష్మణరావు, మాగుపల్లి ప్రేమ్ కుమార్, కామరాజు, వాసుపల్లి పోలివాడు, చిన్నారావు, సతీష్, సురేష్, తోటయ్య, అప్పలనాయుడు, శ్రీను, యర్రయ్య, అప్పన్న, కైలాష్, రామారావు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

పోలీసు శాఖ అండగా ఉంటుంది



హోంగార్డు పూర్ణారావుకు చెక్ అందిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన బి.పూర్ణారావుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ జి.ఆర్.రాధిక భరోసా ఇచ్చారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో పూర్ణారావుకు జిల్లా హోంగార్డుల ఒక్క రోజు వేతన మొత్తం రూ.4.24 లక్షల నగదును చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, ఆర్ఐలు ఉమామహేశ్వరరావు, ప్రదీప్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆసరాగా బీమా



భవిత కేంద్రంలో విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా అధికారులు

నందిగాం: భవిత కేంద్రాల్లో ఉన్న దివ్యాంగులను ప్రభుత్వం అందిస్తున్న నిరామయ బీమా పథకంలో చేర్పించాలని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బి.గోవిందరావు అన్నారు. గురువారం నందిగాంలోని భవిత కేంద్రాన్ని జిల్లా సహిత విద్యా ఉప సమన్వయకర్త అనురాధతో కలిసి సందర్శించారు. విద్యార్థుల వివరాలను ఐఈఆర్‌టీ పినకాన రాణిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీమా పథకంలో చేరిన దివ్యాంగులకు ఆరోగ్య సేవలతో పాటు రూ.2 లక్షల బీమా పరిహారం అందుతుందన్నారు. ఏడాదికి రూ.250 ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు జి.నర్సింహులు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ తిరుమల చైతన్య

పాతపట్నం: పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని డీఈవో ఎస్.తిరుమల చైతన్య ఉపాధ్యాయులకు సూచించారు. తెంబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం డీఈఓ తనిఖీ చేపట్టారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిని పరీక్షించారు. అనంతరం నాడు-నేడు పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ విశ్వనాథం, ఎస్ఎంసీ చైర్మన్ పి.మన్మథరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎముకల శస్త్రచికిత్సకు.. అధునాతన టెక్నాలజీ

- రిమ్స్‌లో అందుబాటులోకి వచ్చిన సీ-ఆర్మ్ యంత్రాలు
- శస్త్ర చికిత్స సమయం తగ్గుదల
- తక్కువ కుట్లతో త్వరగా కోలుకునే అవకాశం



సీ-ఆర్మ్ యంత్రం

శ్రీకాకుళం : ఎముకల శస్త్రచికిత్సకు అధునాతన టెక్నాలజీ శ్రీకాకుళం రిమ్స్‌లో అందుబాటులోకి వచ్చింది. ఆపరేషన్ సమర్థంగా, సులువుగా నిర్వహించేందుకు అవసరమైన అత్యాధునిక టెక్నాలజీ కలిగిన రెండు సీ-ఆర్మ్ (కంప్యూటర్ అసిస్టెడ్ రేడియో మానిటరింగ్) యంత్రాలను రాష్ట్ర ప్రభుత్వం 10 రోజుల క్రితం ఆస్పత్రికి పంపించింది. ప్రస్తుతం వీటిని వినియోగించి క్లిష్ట తరమైన శస్త్ర చికిత్సలను సైతం విజయవంతంగా పూర్తి చేస్తున్నారు. రిమ్స్ వైద్యకళాశాల మంజూరైనపుడు ఇదే తరహా యంత్రాలను ప్రభుత్వం సమకూర్చినప్పటికీ అవి మూలకు చేరాయి. ఇటీవల రిమ్స్‌లో ఎముకల విభాగం హెచ్‌వోడీ డాక్టర్ ధర్మారావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్‌లు తుంటి మార్పిడి, మోచిప్ప మార్పిడి, వెన్నెముక శస్త్రచికిత్సవంటి క్లిష్టతరమైన చికిత్సలను చేపడుతున్నారు. ఇటువంటి తరుణంలో సీ-ఆర్మ్ యంత్రాల అవసరం చాలా ఉందని రాష్ట్ర స్థాయిలో నివేదించగా ప్రభుత్వం స్పందించి రెండు యంత్రాలను పంపించింది. మరో నెల రోజుల్లో మరో రెండు యంత్రాలు కూడా పంపించనున్నట్లు ప్రభుత్వ రిమ్స్ అధికారులకు తెలియజేశారు.

సీ-ఆర్మ్‌తో ఉపయోగాలెన్నో..

'సీ' ఆకారంలో ఉండే సీ-ఆర్మ్ యంత్రం వినియోగించి శస్త్రచికిత్సలు నిర్వహించడం చాలా సులువైన పని. గతంలో మూడు గంటల పాటు జరిపే శస్త్ర చికిత్స గంట నుంచి గంటన్నర లోగా పూర్తి చేయవచ్చు. దీనివల్ల ప్రతి రోజు మరిన్ని శస్త్ర చికిత్సలు జరిపేందుకు అవకాశం ఉంటుంది.

- ఈ యంత్రం వినియోగించడం ద్వారా చిన్నపాటి రంధ్రం చేసి శస్త్రచికిత్సను పూర్తి చేయవచ్చు. తక్కువ కుట్లు, తక్కువ రక్తస్రావం అవుతుంది.
- ఎముక విరిగినచోట కాకుండా కొద్ది దూరంలో రంధ్రం చేసి క్లిప్పులు, రాడ్లు వేయడం వల్ల రోగి త్వరగా నడిచేందుకు అవకాశం ఉంటుంది.
- గతంలో శస్త్ర చికిత్స జరిగిన తరువాత నడిచేందుకు నాలుగైదు నెలలు పట్టేది. సీ-ఆర్మ్ యంత్రంతో ఆపరేషన్ చేస్తే వారం నుంచి పది రోజుల్లోపే నడిచే పరిస్థితి ఉంటుంది. ఇన్‌ఫెక్షన్ కూడా సోకదు.
- ఎముక విరిగిన ప్రాంతాన్ని యంత్రం ద్వారా పరిశీలిస్తూ వైద్యులు శస్త్రచికిత్స పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుంది. దీనివల్ల ఎముకను సరిగ్గా అతికించింది లేనిదీ ఆపరేషన్ సమయంలోనే తెలుసుకోవచ్చు. గతంలో శస్త్ర చికిత్స పూర్తి చేసి రోగి కొంత కోలుకున్న తరువాత ఎక్స్‌రే తీయించి ఎముకలు సరిగా అతికించారా లేదా అన్నది వైద్యులు నిర్ధారించుకునే వారు. సరిగ్గా అతికించకుంటే మరోసారి శస్త్ర చికిత్స జరిపేవారు. ఇప్పుడు అటువంటి పరిస్థితి ఉండదు.

అందరికీ మేలు



సీఆర్మ్ యంత్రాల వల్ల రోగులకు, వైద్యులకు ఎంతగానో మేలు కలుగుతుంది. తక్కువ సమయంలోనే సమర్థంగా ఆపరేషన్ పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుంది.

– డాక్టర్ ప్రసన్నకుమార్, ఆర్థోపెడిక్ సర్జన్, రిమ్స్

చంద్రయాన్ వీక్షణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు



రాకెట్ లాంచింగ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: నెల్లూరులోని శ్రీహరికోటలో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో 'చంద్రయాన్-3 రాకెట్ లాంచింగ్'ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు నడపనుందని శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం డిపో మేనేజర్ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-3 ప్రత్యక్ష వీక్షణకు ఏపీఎస్ఆర్టీసీ శ్రీకాకుళం రీజియన్ ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శ్రీహరికోటలోని అధికారులతో సమన్వయం చేసుకొని ప్రత్యేక అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. డిగ్రీ చదివేవారు ప్రధానంగా సైన్స్ విద్యార్థులకు ఇదొక చక్కని అవకాశమన్నారు. రాకెట్ తయారీ, పనిచేసే విధానాన్ని ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కలుగుతుందన్నారు. ఈ నెల 12న మధ్యాహ్నం 2గంటలకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరుతుందన్నారు. రాకెట్ లాంచింగ్ ప్రదేశం, నేలపట్టు బర్డ్ శాంక్చురి, పులికాట్ బర్డ్ శాంక్చురి, నెల్లూరు బీచ్, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం తదితర ప్రాంతాల సందర్శన ఉంటుందని వివరించారు. తిరుగు ప్రయాణం ఈ నెల 14న రాత్రి 8 గంటలకు బయలుదేరి 15న మధ్యాహ్నం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు బస్సు చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణ చార్జి ఒక్కొక్కరికి రూ.4,100గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7095040608, 9959225608, 7382917289 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, హెచ్‌సీ బొడ్డేపల్లి దక్షిణామూర్తి, టీఎస్ఆర్ఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవిద్య చివరి సెమిస్టర్ ఫలితాలు విడుదల



సెమిస్టర్ పరీక్షలు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అఫిలియేషన్ ఎంపీఆర్ కళాశాలల న్యాయ విద్య మూడు, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ చివరి సెమిస్టర్ ఫలితాలను వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు గురువారం విడుదల చేశారు. న్యాయ విద్య పూర్తిచేసిన విద్యార్థులు ఈ నెల 10లోపు స్టేట్ బార్ కౌన్సిల్‌లో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉండటం, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహించే ప్రవేశ పరీక్షలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉన్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఫలితాలు సకాలంలో విడుదల చేశారు. పరీక్షలకు 153 మంది హాజరు కాగా 151 మంది ఉత్తీర్ణత సాధించారు. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఫలితాలు అందుబాటులో ఉంచారు. ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు.

సజావుగా సెమిస్టర్ పరీక్షలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ 4, ఇంజినీరింగ్ 6, 8 సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య గురువారం పరీక్ష కేంద్రాలను సందర్శించి విద్యార్థుల హాల్ టికెట్లు, హాజరు శాతం పరిశీలించారు.

మేలు చేసే ప్రభుత్వానికి మద్దతివ్వండి

- సంక్షేమానికి భరోసా 'జగనన్న సురక్ష'
- మంత్రి ధర్మాన ప్రసాదరావు



ధ్రువపత్రం అందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సంక్షేమానికి సంపూర్ణ భరోసా జగనన్న సురక్ష కార్యక్రమమని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గురువారం నగరంలో 28వ డివిజన్ ఇన్‌చార్జ్ మండవల్లి రవి ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ కల్యాణ మండపంలో హెడ్ పోస్టాఫీసు పరిధిలో ఉన్న లబ్ధిదారులతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోనే మ్యానిఫెస్టోను పూర్తి స్థాయిలో అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. గ్రామ సచివాలయాల పేరిట పాలన ప్రజల ఇళ్ల వద్దకే తీసుకువచ్చామని, ఇదే అసలైన అభివృద్ధి అని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలకు ఈ అభివృద్ధి అర్థం కావడం లేదన్నారు. నాలుగేళ్లలో వచ్చిన మార్పును గమనిస్తే పౌరులకు సామాజిక గౌరవం పెరిగిందో లేదో తెలుస్తోందన్నారు. ఎవ్వరి దగ్గర తలవంచుకు జీవించే రోజులు పోయాయని, ఇవేవీ గుర్తించని వారు విమర్శలు చేస్తున్నారన్నారు. మనవద్ద ఉన్న మీడియా సంస్థలు పార్టీ ప్రయోజనాలకు పని చేస్తుంటాయని, ప్రజలకు మంచి చూపించే ఆలోచన వారికి ఉండటం లేదని విపక్ష పార్టీలకు చెందిన మీడియాను ఉద్దేశించి విమర్శించారు. మేలు చేసే ప్రభుత్వానికి మరోసారి మద్దతు ఇవ్వాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మెంటాడ పద్మావతి, సాదు వైకుంఠరావు, ఎం.వి.స్వరూప్, ఖాన్, కోణార్క్ శ్రీను, డాక్టర్ పైడి మహేశ్వరరావు, పొన్నాడ రుషి, భైరి మురళి, బరాటం సంతోష్, ఉన్నా నాగరాజు, గాంధీ, ప్రకాష్, జలగడుగుల శ్రీను, భరద్వాజ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ



వెండి కిరీటం అందజేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్ (విశాఖపట్నం): సిరులతల్లి కనక మహాలక్ష్మికి శ్రీకాకుళం జిల్లాకు చెందిన వి.రమ్య కుటుంబ సభ్యులు 262 గ్రాముల వెండి కిరీటం బహూకరించారు. వెండి కిరీటాన్ని ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలానికి అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్త ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక ఇంజనీరు సీహెచ్‌వీ రమణ, ఆలయ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

21న ఉద్యోగుల సమస్యలపై గ్రీవెన్స్



కలెక్టర్‌ను కలిసిన ఎన్జీఓ సంఘం నేతలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఏపీ ఎన్జీఓ సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, ఎన్జీఓ నేతలు గురువారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని, క్యాబినెట్లో తీసుకున్న నిర్ణయం మేరకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమేనని, సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ నెల 21న ఉద్యోగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీఓ నేతలు బడగల పూర్ణచంద్రరావు, కె.జయరావు, గోవింద్ పట్నాయక్, ఆర్.వేణుగోపాల్, బి.శ్రీనివాసరావు, పైడి రవి, శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గ్రాంట్లను విడుదల చేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల గ్రాంటు వెంటనే విడుదలయ్యేలా చొరవ తీసుకోవాలని యూటీఎఫ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతి ఏడాది పాఠశాలలో విద్యుత్ బిల్లులు, చాక్‌పీస్‌లు, ఇతర అవసరాల నిమిత్తం ప్రభుత్వం నిధులు విడుదల చేసే సంప్రదాయం ఉందని గుర్తుచేశారు. గత ఆర్థిక సంవత్సరంలో బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పొందూరు అప్పారావు, సంపతిరావు కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు చేరువలో వైద్య సేవలు

- అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో స్పీకర్ తమ్మినేని సీతారాం



అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: వైద్య రంగానికి పెద్దపీట వేస్తూ రాష్ట్రంలో సగటు పౌరుడు ఆరోగ్యవంతమైన జీవనం కొనసాగించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. మెట్టక్కివలసలో ప్రభుత్వ నిధులు రూ.1.03 కోట్లతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ గురువారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యం, విద్య, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామాల్లో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు మరింత చేరువలో వైద్యసేవలు ఉంచారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా ప్రతీ గ్రామంలో మొబైల్ వైద్యం కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీ సర్కార్‌కే దక్కిందన్నారు. రాష్ట్రంలో ప్రతీ నియోజకవర్గంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి సంకల్పించారన్నారు. ఇందులో భాగంగా బుధవారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రిని కలిసి అనుమతుల మంజూరు కోసం చొరవ తీసుకోవాలని విన్నవించినట్లు తెలిపారు. శ్రీకాకుళం ఆర్డీఓ బొడ్డేపల్లి శాంతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అనురాధ, మున్సిపల్ కమిషనర్ రవిసుధాకర్, ఈఈ సుగుణాకర్, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు

ఆ అస్థిపంజరం.. ఇచ్ఛాపురం వాసిది

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో దొరికిన అస్థి పంజరం కేసును స్టీల్‌ప్లాంట్ పోలీసులు ఛేదించారు. ఆ అస్థి పంజరం ఇచ్ఛాపురానికి చెందిన కె.కోటేశ్వరరావుదిగా పోలీసులు గుర్తించారు. మేకల మేత కోసం వెళ్లి చెట్టు నుంచి కింద పడి అతను మృతి చెందినట్టు దర్యాప్తులో తేలినట్టు సమాచారం. ఈ నెల 1న టౌన్‌షిప్‌లో దొరికిన అస్థి పంజరం స్థానికంగా కలకలం రేకెత్తించింది. కేసును సవాలుగా తీసుకున్న స్టీల్‌ప్లాంట్ పోలీసులు అతని వద్ద దొరికిన ఏటీఎం కార్డు, కత్తి, స్వాధీనం చేసుకున్న బైక్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. పదేళ్ల కిందట భార్య, ఇద్దరు పిల్లలను వదిలి వచ్చేసిన కోటేశ్వరరావు దేశపాత్రునిపాలెంలో ఓ ఒంటరి మహిళతో ఉంటున్నాడు. నిత్యం గంజాయి సేవించి చిల్లర దొంగతనాలు చేయడం వృత్తిగా మార్చుకున్నాడు. ఇందులో భాగంగా మేకలను దొంగలించడం, వాటికి మేత తేవడం అతని ప్రవృత్తి. నెల రోజుల కిందట ఆ విధంగా టౌన్‌షిప్‌కు బైక్‌పై వచ్చిన కోటేశ్వరరావు కత్తితో కొన్ని కొమ్మలు కొట్టే క్రమంలో కింద జారిపడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకును కోటేశ్వరరావు బంధువులు గుర్తించడంతో కేసు చిక్కుముడి వీడింది.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కే. 10గ్రా.)	59,060-00
బంగారం(22కే. 10గ్రా.)	54,150-00
వెండి (కిలో)	75,800-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹230	₹ 240

15, 16 తేదీల్లో రాష్ట్రస్థాయి ఉషూ పోటీలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్, నిర్వహణ కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి ఉషూ పోటీలు విజయవంతం చేయాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉషూ అసోసియేషన్ పర్యవేక్షణలో శ్రీకాకుళం జిల్లా ఉషూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో శ్రీకాకుళం రూరల్ మండలం వప్పంగి వేదికగా ఏపీ 10వ సబ్ జూనియర్, 9వ జూనియర్ బాల బాలికల రాష్ట్రస్థాయి ఉషూ చాంపియన్‌షిప్-2023 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల వాల్ పోస్టర్‌ను కృష్ణదాస్ తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. వివిధ జిల్లాల నుంచి హాజరయ్యే క్రీడాకారుల వసతి, భోజన, ఇతర ఏర్పాట్లను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉషూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్, తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు, ఉషూ కోచ్‌లు కురిటి తారకరామ, కొమర మోహనకృష్ణ, బి.ధనంజయరావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి



మహాలక్ష్మీనాయుడు (ఫైల్)



మృతి చెందిన గోపాలరావు

రణస్థలం: మండలంలోని వెల్పురాయి గ్రామంలో పిడుగుపాటుకు గురై గురాన మహాలక్ష్మీనాయుడు(37) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్పురాయికి చెందిన మహాలక్ష్మీనాయుడు, బాలి చిన్నంనాయుడులు గ్రామానికి కొంత దూరంలో పొలంలో ఒకే గొడుగు కింద ఉండి గురువారం ఆవులు మేపుతుండగా సాయంత్రం 4గంటల సమయంలో పిడుగుపడింది. ఈ ఘటనలో మహాలక్ష్మీనాయుడు అక్కడికక్కడే మృతిచెందగా చిన్నంనాయుడుకు గాయాలయ్యాయి. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడ్ని శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడు దివ్యాంగుడు. తండ్రి శ్రీరాములు, తల్లి అమ్మన్న, ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మదనాపురంలో..

కొత్తూరు: మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన గెల్లంకి గోపాలరావు(48) పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. అంగూరు గ్రామ సమీపంలో వంశధార నది నుంచి టైరు బండితో ఇసుక తీసుకువస్తుండగా పిడుగు పడటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. గోపాలరావుతో పాటు జత పోతులు పిడుగుపాటుకు బలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య సావిత్రి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం అపహరణ

కోటబొమ్మాళి: మండలంలోని జర్జంగి గ్రామంలో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. పోలాకి మండలం ప్రియాగ్రహారం గ్రామానికి చెందిన బెవర శివ మంగళవారం సాయంత్రం జర్జంగిలోని తన సోదరి కిల్లి లక్ష్మి ఇంటికి బైక్‌పై వచ్చాడు. బుధవారం ఉదయం లేచి చూసేసరికి బైక్ ఇంటి వద్ద కనిపించలేదు. ఊరంతా వెతికినా బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ లక్ష్మణరావు గురువారం తెలిపారు.

సంక్షేమానికి సంపూర్ణ భరోసా

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సంక్షేమానికి సంపూర్ణ భరోసా దక్కుతుందని ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. గురువారం జిల్లావ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్



సారవకోట: సారవకోటలో ధ్రువపత్రాలు అందజేస్తున్న నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



మెళియాపుట్టి: గోకర్ణపురంలో ధ్రువపత్రాలు అందిస్తున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి